చీఫ్ ఇంజినీర్లుగా సీజీఎంలు

హోదా మారుస్తూ డిస్కం నిర్ణయం

సిటీబ్యూరో, జూన్ 29(నమస్తే తెలంగాణ): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో చీఫ్ జనరల్ మేనేజర్స్ (సీజీఎం)గా ఉన్న హోదాను చీఫ్ ఇంజినీర్(సీఈ)గా మారుస్తూ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ శనివారం ప్రత్యేకంగా ఆదేశాలు జారీ చేశారు. ఇంజినీరింగ్ సర్వీసులో విధులు నిర్వహిస్తున్న ఉన్నతాధికారులను సీజీఎంలుగా సంబోధించడం సరైందిగాలేదని గుర్తించి, ఇక నుంచి డిస్కంలో సీజీఎంలుగా కాకుండా సీఈలుగా పిలవాలని ఆదేశాలు జారీ చేశారు. డిస్కం పరిధిలో మొత్తం 16 మంది సీజీఎంలు వివిధ భాగాలను పర్యవేక్షిస్తున్నారు. ఈ మార్పు కేవలం హోదాలో ఉంటుందని, వారు పనిచేసే విధానంలో ఎలాంటి మార్పు ఉండదని ఆదేశాల్లో పేర్కొన్నారు.

బల్దియా ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

సిటీబ్యూరో, జూన్ 29(నమస్తే తెలంగాణ): జీహెచ్ఎంసీ పరిధిలో వివిధ కేటగిరీల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన 38 మందికి అధికారులు ఆత్మీయ వీడ్కోలు తెలిపారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ నళిని పద్మావతి మాట్లాడుతూ, ప్రతి ఉద్యోగికి రిటైర్‌మెంట్ అనేది సహజమన్నారు. పదవీ బాధ్యతల నుంచి విరమణ పొందిన తర్వాత కూడా ఉద్యోగికి కొత్త జీవితం ఉంటుందని, దాన్ని మలుచుకోవడం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులందరినీ అడిషనల్ కమిషనర్‌తో పాటు, పలువురు ఉన్నతాధికారులు ఘనంగా సత్కరించారు.

నేడు కార్టూనిస్టుల మెగా వర్క్‌షాప్

సిటీబ్యూరో, జూన్ 29(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 30న ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ వారి సౌజన్యంతో తెలుగు కార్టూనిస్టుల మెగా వర్క్‌షాప్ జరుగనున్నది. ప్రెస్‌క్లబ్ హైదరాబాద్ కమిటీ అధ్యక్షుడు వేణుగోపాల్, జనరల్ సెక్రెటరీ ఆర్.రవి కాంత్ రెడ్డి, హాస్యానందం సంపాదకులు రాము, ప్రముఖ కార్టూనిస్ట్ బ్నిం, ప్రముఖ యోగా శిక్షకురాలు ఏ.సంగీత ముఖ్య అతిథులుగా హాజరవుతారు. ప్రముఖ కార్టూనిస్టులు టీవీ, సుభాని, సురేంద్ర, నర్సిం, జయదేవ్, శంకర్, శంకు, మృత్యుంజయ్ తదితరులు కార్టూన్ గీసే సమయంలో పాటించాల్సిన మెలకువలు తెలియజేస్తారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీకి పంపించిన కార్టూన్లను మధ్యాహ్నం 2 గంటలకు ప్రదర్శిస్తారు. అనంతరం, బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేస్తారు. ఆర్ట్ బార్ సహ నిర్వహణలో ఈ వర్క్‌షాప్ జరుగనుండగా, హరికృష్ణ, అశ్వక్, రాజశేఖర్, నందు, హరగోపాల్, సీఆర్ రాజు కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారు.

నగరంలో అతిపెద్ద పశు వైద్యశాల

సత్యం, శివం, సుందరం గోశాలలో ఏర్పాటుకు సన్నాహాలు

సిటీబ్యూరో, జూన్ 29(నమస్తే తెలంగాణ): దేశంలోనే అతి పెద్ద పశు వైద్యశాలగా గుర్తింపు పొందిన మా సరస్వతి పశు వైద్యశాల హైదరాబాద్‌లోనూ ఫెసిలిటీ సెంటర్‌ను ప్రారంభించనుంది. సత్యం శివం సుందరం గోశాలలో దీన్ని ఏర్పాటు చేయనున్నారు. 5100 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండే ఆపరేషన్ థియేటర్, ఐసీయూ, డయాగ్నోస్టిక్స్, వైద్య సదుపాయాలతో గగన్‌పహాడ్‌లోని గోశాలలో ప్రారంభించనున్నారు. పశు వైద్య నిపుణులు, సర్జన్లు, పారా మెడికల్ సిబ్బందితో గగన్‌పహాడ్‌లో ఫెసిలిటీ సెంటర్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. నగరానికి చెందిన జువెల్లరీ వ్యాపారి ధరమ్ రాజ్ రంఖా(85) గడిచిన 30 ఏళ్లుగా గగన్‌పహాడ్‌లో 3200 ఆవులు, బురుజుగడ్డలో మరో 2800 ఆవులకు గోశాలను సత్యం శివం సుందరమ్ నిర్మించి సంరక్షిస్తున్నారు. ఈ క్రమంలో వాటి సంరక్షణతో పాటు మూగజీవాలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే చిరకాల ఆకాంక్షతో ఈ ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లుగా తెలిపారు. కేవలం ఆవులు, గేదెలు మాత్రమే కాకుండా గొర్రెలు, మేకలు, కుక్కలను సంరక్షించి వాటికి పునరావాసం కల్పిస్తున్నట్లుగా నిర్వాహకులు పేర్కొన్నారు.

నేడు సైక్లాథాన్

సిటీబ్యూరో, జూన్ 29(నమస్తే తెలంగాణ): బొల్లారం రాష్ట్రపతి నిలయం వేదికగా వెయ్యి మంది సైక్లిస్టులతో ఆదివారం సైక్లాథాన్ నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ సైక్లింగ్ గ్రూప్ అధ్యక్షుడు నందనూరి రవీందర్ పేర్కొన్నారు. ఉదయం ఆరు గంటల నుంచి తొమ్మిది గంటల వరకు సైక్లింగ్ కొనసాగుతుందని తెలిపారు. 'పెడల్ ఫర్ ద ప్లానెట్' థీమ్‌తో ఈ సైక్లింగ్ రైడ్ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రపతి నిలయం చొరవతో ఎన్ఎండీసీ భాగస్వామ్యంతో జరుగుతున్న ఈ సైక్లింగ్‌లో హెస్‌సీజీ సైక్లిస్టులు పాల్గొంటారని వివరించారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొ.కోదండరాం



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం

నేరేడ్‌మెట్, జూన్ 29: వినాయకనగర్ ఎస్ఎస్ గార్డెన్‌లో శనివారం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు మాట్లాడుతూ, రాష్ట్రం ఏర్పాటు చేసిన తర్వాత కాంట్రాక్టు , ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని గత ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం పర్మినంట్ చేయాలని డిమాండ్ చేశారు. కొన్నేండ్లుగా పర్మినెంట్ ఉద్యోగుల తరహాలో విధులు నిర్వర్తించినా, ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న కొంతమంది అధికారులు అలసత్యం, నిర్లక్ష్యం వల్ల తాము ఆకలి చావుల మధ్య ఆగమవుతున్నామని అన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులందరిని పర్మనెంట్ చేయాలని, జీహెచ్ఎంసీలో ఖాళీలుగా ఉన్న పోస్టులలో ఔవుట్ సోర్సింగ్ వారికి అవకాశం కల్పించాలని తెలిపారు. అనంతరం, జేఏసీ చైర్మన్ కోదండరాం మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేసేలా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జేఏసీ జీహెచ్ఎంసీ కన్వీనర్ జహీరుద్దీన్, వెంకట్, సంజీవ్, రాము, శ్రీనివాస్, శానిటేషన్ స్టాఫ్ రెడ్డి, ఎఫ్ఎస్ఏ వింగ్ పాల్గొన్నారు.

బీసీలకు రావాల్సిన వాటాకు గండి

తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు మహాసభ

సమావేశంలో మంగళారపు లక్ష్మణ్,తదితరులు

కాచిగూడ, జూన్ 29: బీసీలకు రాజ్యాంగబద్ధంగా రావాల్సిన వాటా దక్కడంలేదని, బీసీలు తిరగబడే రోజులు దగ్గర పడ్డాయని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ ప్రధాన కార్యదర్శి మంగళారపు లక్ష్మణ్ అన్నారు. కాచిగూడ మహాసభ కార్యాలయంలో శనివారం రాత్రి విలేకరులతో ఆయన మాట్లాడుతూ, 56 శాతం ఉన్న బీసీలకు చట్టసభల్లో సీట్ల కేటాయింపు, మంత్రుల కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా కేటాయించలేదని, దానం నాగేందర్‌కు కేటాయించి, కార్పొరేషన్లలో అత్యధిక శాతం మున్నూరు కాపులకు కేటాయించలేదని సీఎం రేంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

కార్మికులకు మెరుగైన సేవలందించాలి

అధికారులకు రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరి సంజయ్ కుమార్ సూచన

చిక్కడపల్లి, జూన్ 29: కార్మికులకు మెరుగైన సేవలందించాలని, కార్మిక సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగాలని రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరి సంజయ్ కుమార్ అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రిన్సిపాల్ సెక్రటరి, లేబర్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్, ఫ్యాక్టరీస్, (ఎల్‌టీఈ,ఎఫ్)గా సంజయ్ కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంను సందర్శించారు. అనంతరం, కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య అధ్యక్షతన దక్షిణాది రాష్ట్రాలలో కార్మిక సంక్షేమం అమలుకు సంబధించిన అంశాలపై సమావేశంలో ప్రిన్సిపల్ సెక్రటరి పాల్గొన్నారు. సమావేశంలో కార్మిక శాఖ అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఇందులో పారిశ్రామిక సంబంధాలు, కార్మిక చట్టాల అమలు, ప్రస్తుత చట్టం ప్రకారం సంక్షేమ నిబంధనలపై గురించి ప్రిన్సిపల్ సెక్రటరీ సంజయ్ కుమార్ తెలుసుకున్నారు. డిపార్ట్‌మెంట్ లేబర్ వెల్ఫేర్ బోర్డ్, తెలంగాణ బిల్డింగ్ అండ్ ఇతర కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు కోసం బడ్జెట్ కేటాయింపు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో సంయుక్త కమిషనర్లు చతర్వేది, శ్యామ్ సుందర్ రెడ్డి, సునీత, డీసీఎల్ శ్రీనివాస్ గౌడ్, రాజేంద్ర ప్రసాద్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ జీవో నం.5ను ఉపసంహరించుకోవాలి

కార్మిక సంఘాల నాయకుల ధర్నా

ధర్నాలో కార్మిక సంఘాల నాయకులు

చిక్కడపల్లి, జూన్ 29: ఐటీ, ఐటీఈఎస్ పరిశ్రమలకు కార్మిక చట్టాలను మినహాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ఎంఎస్-5 ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని కార్మిక శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ, హెచ్ఎంస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెబ్బా రామారావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, టీఎన్టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కె.బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు కిషన్ తదితరులు హాజరయ్యారు. అనంతరం కార్మిక శాఖ అదనపు కమిషనర్ ఇ.గంగాధర్‌కు వినతి పత్రం ఇచ్చారు.

నెక్సెస్ సెలెక్ట్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఆయుష్మాన్ ఖురానా

జూబ్లీహిల్స్, జూన్ 29: నెక్సెస్ సెలెక్ట్ మాల్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా బాలీవుడ్ స్టార్ ఆయుష్మాన్ ఖురానాను ప్రకటించింది. నెక్సెస్ సెలెక్ట్ ట్రస్ట్ పరిధిలో దేశ వ్యాప్తంగా ఉన్న 17 మాల్స్‌లు దేశ వ్యాప్తంగా లక్షలాది మంది వినియోగదారులకు షాపింగ్ అనుభవంతో పాటు జీవనోపాధి కల్పిస్తున్న మొట్టమొదటి లిస్టెడ్ రిటైల్ ఆర్ఈఐటీ స్టోర్స్‌గా నిలిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సెలెక్ట్ మాల్స్‌కు బ్రాండ్ అంబాసిడర్‌గా రెండో పర్యాయం నియమితులైన ఆయుష్మాన్ ఖురానాతో పూర్వ వైభవం వస్తుందని చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ నిశాంక్ జోషి పేర్కొన్నారు.

మోతీలాల్ నాయక్‌కు బీజేపీ నేతల పరామర్శ

బన్సీలాల్‌పేట్, జూన్ 29: నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మోతీలాల్ నాయక్ చేపట్టిన దీక్ష ఆరో రోజుకు చేరుకున్నది. సికింద్రాబాద్ గాంధీ దవాఖానలో ఇప్పటికీ కొనసాగుతున్నది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వి.ప్రకాశ్‌రెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాలు రాణి రుద్రమదేవి, బీజెవైఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మహేందర్, నాయకులు మహేశ్, వినీత్, అరవింద్, ఆదిత్య, ఆయుశ్‌లు మోతీలాల్ నాయక్‌ను శనివారం కలిసి తమ సంఘీభావం తెలిపారు. మోతీలాల్‌కు ఏదైనా హానీ జరిగితే దానికి సీఎం రేవంత్‌రెడ్డే కారణమవుతారని అన్నారు. ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని, గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాల పోస్టులను పెంచాలని, సిలబస్ వేర్వేరుగా ఉన్నందున పరీక్షలకు 40 రోజుల వ్యవధి ఉండాలని, జీఓ 46ను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.

తండ్రిగా భావించి.. సేవలందించాను

- ఉద్యమ నేతను కంటికి రెప్పలా కాపాడుకున్నాను
- నిమ్స్ స్టాఫ్ నర్సు షహీనా

తెలంగాణ ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టినప్పుడు దవాఖానలో సేవలందించిన నిమ్స్ దవాఖాన స్టాఫ్ నర్సు షహీనా (ఫైల్)

ఖైరతాబాద్, జూన్ 29:తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరుకున్న తరుణమది. నాడు ఢిల్లీ కాంగ్రెస్ పెద్దలతో తాడో పేడో తేల్చుకునేందుకు ఉద్యమ నేత కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టారు. తెలంగాణ అంతా ఏకమై కేసీఆర్ పక్షాన నిలబడింది. ఒక్కసారిగా ఉద్యమం నిమ్స్ వైపు మళ్లింది. ఉద్యమ నేత ఆమరణ దీక్షకు ఈ దవాఖాన వేదికగా నిలిచింది. నాడు వైద్యుల పర్యవేక్షణ ఉన్నా.. ఒక్కరు మాత్రం కేసీఆర్‌ను కంటికిరెప్పలా కాపాడుతూ సపర్యలు చేశారు. ఎనిమిది గంటల పని సమయాన్ని ముగించుకొని ఇంటికి వెళ్లాల్సి ఉండగా, మూడున్నర కోట్ల మంది ప్రతినిధిగా ఆమరణ దీక్ష చేపట్టిన కేసీఆర్‌ను అంటిపెట్టుకొని ఆయనకు వైద్య సేవలందించారు. ఆమె ఎవరో కాదు.. నిమ్స్ దవాఖానలో 32 ఏండ్ల పాటు సేవలందించి ఈ నెల 29న ఉద్యగ విరమణ పొందిన సీనియర్ స్టాఫ్ నర్సు షహీనా. నాటి ఉద్యమ రథసారథి, నేటి తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌తో ఉన్న ఉద్యమ అనుబంధాన్ని ఆమె 'నమస్తే తెలంగాణ'తో పంచుకున్నారు.

ఆ రోజు ఏమైంది..

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధనే లక్ష్యంగా 2009 నవంబర్ 29న ఉద్యమ రథసారథి కేసీఆర్ ఆమరణ దీక్ష చేపట్టారు. క్రమంగా ఆరోగ్యం క్షీణిస్తుండటంతో ఆయనను హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో చేర్పించారు. కార్డియో థొరాసిక్ రికవరీ రూమ్‌లో ఉంచి చికిత్స అందిస్తున్నారు. దీక్షను విరమించమని, చికిత్సకు సహకరించకుంటే ప్రాణాలకు ప్రమాదమని వైద్యులు చెప్పినా, ఆయన పట్టించుకోలేదు. అప్పుడు అదే గదిలో స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న షహీనా కేసీఆర్‌లో ఉన్న పట్టుదలను చూసి మంత్రముగ్ధులయ్యారు. అప్పటికే నరనరాల్లో ఆమెకు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ఉండగా, ఉద్యమ రథసారథికి తన వంతు సేవలందించి కంటికి రెప్పలా కాపాడుకోవాలని ఆమె సంకల్పించారు. డిసెంబర్ 10వ తేదీన ఆయన దీక్ష విరమించేంత వరకు అంటిపెట్టుకొని ఉన్నారు.

సార్‌కు సేవలందించడం నా అదృష్టం

నాకు బాగా గుర్తుంది. 2009 నవంబర్ 29న కేసీఆర్ సార్ ఆస్పత్రిలో చేరినప్పుడు ఆయన పోరాట, దీక్షా పటిమ నాకు స్ఫూర్తి కలిగించింది. ప్రత్యేక రాష్ట్రం సాధించాలంటే కేసీఆర్‌తోనే సాధ్యమని, ఆయనను బతికించుకోవడం కర్తవ్యంగగా భావించాను. కోట్లాది మంది ప్రజల గొంతుకగా ఉన్న కేసీఆర్ బెడ్‌పై అలా ఉండటం చూసి తట్టుకోలేక పోయాను. బీపీ, షుగర్ పరీక్షలు చేసేటప్పుడు, సపర్యలు చేస్తున్నప్పుడు 60 ఏండ్ల తెలంగాణ గోస, ఇక్కడి ప్రజల ఆకాంక్ష, ప్రత్యేక రాష్ట్రం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలపై మాట్లాడేవారు. అత్యంత నీరసంగా మారిపోయిన కేసీఆర్‌కు సేవలందించడంలో ఎలాంటి కష్టం అనిపించలేదు. నా తండ్రికే సేవ చేస్తున్నాన్న భావన కలిగింది.

-షహీనా, స్టాఫ్ నర్సు నిమ్స్ దవాఖాన

సేవకిక సెలవు..

ఉద్యోగ విరమణ పొందిన నిమ్స్ స్టాఫ్ నర్సు షహీనా

ఖైరతాబాద్, జూన్ 29: నిమ్స్ దవాఖానలో వివిధ విభాగాల్లో స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహించిన షహీనా శనివారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా నిమ్స్ లెర్నింగ్ సెంటర్‌లో ఏర్పాటు చేసి ఉద్యోగ విమరణ వేడుకల్లో షహీనాను డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప, వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. తెలంగాణ ఉద్యమ నేపథ్యంలో అప్పటి ఉద్యమ రథసారథి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఆమె విశేష సేవలందించారు. గతేడాది సైతం అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు చొరవతో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలానికి చెందిన తెలంగాణ కవి, గాయకుడు గిద్దె రామనర్సయ్యను నిమ్స్ దవాఖానలో చేర్పించగా, ఆమె వైద్య సేవలందించారు. కాగా, శనివారం పదవీ విరమణ సందర్భంగా దవాఖానకు వచ్చిన గిద్దె రామనర్సయ్య ఆమె ఆశీర్వాదం తీసుకొని వెళ్లారు.

ఓబీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలి

ఎంపీకి ఐఎస్‌యూ వినతి

మేడ్చల్, జూన్ 29: కేంద్ర విద్యా సంస్థలైన ఐఐటీ, త్రిపుల్ ఐటీ, జీఎఫ్‌టీలో ఓబీసీ విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని ఇండియా స్టూడెంట్ యూనియన్ జాతీయ, రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు, వెంకటేశ్ గౌడ్ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పరిధిలోని విద్యా సంస్థలు ఎన్ఐటీ, త్రిపుల్ ఐటీ, జీఎఫ్‌టీలలో 57,152 సీట్లకు జోసా కౌన్సెలింగ్, సీ సాట్ నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా 2023 సంవత్సరలో సీట్ల కేటాయింపులో ఓబీసీ విద్యార్థులకు 27 శాతం రిజర్వేషన్ ప్రకారం, 15431.04 గాను 14694 సీట్లను భర్తీ చేసిందన్నారు. ఈ లెక్కన 737 సీట్లను 2023-24 విద్యా సంవత్సరంలో కోత విధించందన్నారు. ఆయా రంగాల విద్యాలయాల్లో కటాఫ్ దగ్గర ఉన్న ర్యాంకుల విద్యార్థులతో భర్తీ చేయాల్సి ఉందన్నారు. మిగిలిపోవడానికి అవకాశం ఇచ్చారు. కాని, దగ్గరగా ఉన్న మెరిట్ విద్యార్థులకు సీట్లు కేటాయించకపోవడం వల్ల ఓబీసీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. ఈ విధానం ఓబీసీలకు వ్యతిరేకమన్నారు. ఇందుకు ఎంపీ ఈటల రాజేందర్ స్పందిస్తూ న్యాయం చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

కార్పొరేటర్ భార్యచే సంక్షేమ చెక్కుల పంపిణీ

- ఇదేంటని ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులు - ఇరువురి మధ్య ఘర్షణ

ఖైరతాబాద్, జూన్ 29: ప్రజా ప్రతినిధి అందించాల్సిన సంక్షేమ పథకాల చెక్కులను ఆయన సతీమణి పంపిణీ చేయడంతో ఉద్రిక్తతకు దారి తీసింది. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఖైరతాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, రహమత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి హాజరయ్యారు. అయితే, బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ హాజరుకాకపోవడంతో ఆయన భార్యను పంపించాడు. ఆమె చెక్కులు పంపిణీ చేస్తుండగా, అక్కడే ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఈ తీరుపై అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులను నిలదీశారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ఆర్థిక సాయంతో పాటు బంగారం సైతం అందజేస్తామని కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిందని, ఆ హామీని ఎందుకు నెరవేర్చడంలేదని ప్రశ్నించారు. దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. ఒకానొక దశలో బాహాబాహీ చోటు చేసుకుంది. ఘటనా స్థలానికి చేరుకున్న ఖైరతాబాద్ పోలీసులు ఇరువర్గాలను శాంతింపజేసి అక్కడి నుంచి పంపించి వేశారు.

తూంకుంట మున్సిపల్‌లో రభస

కుర్చీలు విసరడంతో వైస్ చైర్‌పర్సన్‌కు గాయాలు

గాయాలకు గురైన వైస్ చైర్మన్ వాణి

శామీర్‌పేట, జూన్ 29: తూంకుంట మున్సిపాలిటీ కార్యాలయంలో సభ్యుల మధ్య వాగ్వాదం దాడులకు దారి తీసింది. తూంకుంట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించడానికి అధికారులు శనివారం ఏర్పాట్లు పూర్తి చేశారు. సమావేశానికి ఒక్కొక్కరుగా సభ్యులు వస్తున్న సమయంలో ఓ కౌన్సిలర్ భర్త, కుటుంబ సభ్యులు సమావేశ ప్రాంగణంలో సభ నిర్వహించేది లేదు. బైకాడ్ చేసేద్దాం బయటకు రావాలని కోరారు. అదే సమయంలో చైర్మన్ ఎందుకు నిలిపివేయడం? సభ తర్వాత ఎజెండాలో లేని విషయాలు ఏమైనా ఉంటే మాట్లాడుకుందాం అని అంటుండగా ఇరువురి మధ్య మాట మాట పెరిగా దాడులకు దారితీసింది. ఆ సమయంలో కొందరు కుర్చీల తం తు, సభా వేదిక పైకి కుర్చీని విసిరారు. దీంతో కుర్చీ నేరుగా వైస్ చైర్మన్ అయిన పన్నాల వాణికి తగలడంతో గాయాలయ్యాయి. వెంటనే శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు శామీర్‌పేట పోలీసులు మొత్తం 8 మందిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

వైద్య విద్యార్థికి బీఎల్ఆర్ ఆర్థిక సాయం

అభినందించిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

మెడికల్ విద్యార్థి అమర్నాథ్ గౌడ్‌కు మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేతుల మీదుగా ఆర్థిక సాయం అందజేస్తున్న బీఎల్ఆర్ ట్రస్ట్ అధినేత, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

కాప్రా, జూన్ 29: ఉప్పల్ నియోజకవర్గంలో ఉన్నతమైన వైద్య విద్యలో సీటు సాధించిన పేద విద్యార్థులకు ఫీజు కడుతున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిని రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభినందించారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని కుషాయిగూడకు చెందిన అమర్‌నాథ్ గౌడ్ ఎల్‌బీ నగర్ కామినేని హాస్పిటల్‌లో మెడికల్ కాలేజీలలో సీటు సాధించాడు. తల్లిదండ్రులిద్దరూ చని పోవడంతో మెడిసిన్ చదువుకునే స్థోమత లేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని బీఎల్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, తన బీఎల్ఆర్ ట్రస్ట్ ద్వారా కేసీఆర్ చేతుల మీదుగా ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌లో ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, శివా గౌడ్, రాజేశ్వర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సులో హైకోర్టు న్యాయవాదికి డాక్టరేట్

మధ్యప్రదేశ్ సీఎం డాక్టర్ మోహన్ యాదవ్‌ల చేతుల మీదుగా డాక్టరేట్‌ను అందుకుంటున్న హైకోర్టు న్యాయవాది అమరేందర్‌రెడ్డి

అబిడ్స్, జూన్ 29: హైదరాబాద్ నగరానికి చెందిన హైకోర్టు న్యాయవాది అమరేందర్ రెడ్డి డాక్టరేట్‌ను పొందారు. కృత్రిమ మేధస్సులో చట్టపరమైన, నైతికపరమైన చిక్కులు, కంప్యూటర్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై పరిశోధన చేసిన హైకోర్టు న్యాయవాది అమరేందర్ రెడ్డి భోపాల్‌లోని మానస సరోవర్ గ్లోబల్ యూనివర్శిటీ ద్వారా పీహెచ్‌డీ అందుకున్నారు. భోపాల్‌లోని మాసన సరోవర్ గ్లోబల్ యూనివర్శిటీలో స్నాతక వేడుకను ఘనంగా నిర్వహించారు. యూనివర్శిటీలో జరిగిన స్నాతకోత్సవంలో మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్, ఆ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి, ఆరోగ్య భారతి జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ రామేశ్వర శర్మ, యూనివర్శిటీ ఛాన్సలర్ తివారిలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్యా హక్కు చట్టాన్ని పటిష్టం చేయాలి

**బహుజన ప్రజాశక్తి